# రాజ్యాంగబద్ధ హక్కుల అమలు ఏదీ?

**డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్**


మాట్లాడుతున్న డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** దళితులు, ఆదివాసీలకు రాజ్యాంగ బద్ధంగా సంక్రమించిన హక్కులు అమలు కావడం లేదని అందులో తెలంగాణ రాష్ట్రం పూర్తిగా వెనుకబడిపోయిందని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిటిజన్స్, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ(సీవీఎంసీ) ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టు దాని అమలు తీరు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ... కేసీఆర్ వచ్చాక ఎస్సీ, ఎస్టీతో పాటు మానవ హక్కుల కమిషన్ కూడా నిర్వీర్యం అయిందని ఆరోపించారు. గతంలో ఐపీఎస్ అధికారులను సైతం కమిషన్ వారు నిలదీసి అడిగే వారని ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రైతులు, కాళేశ్వరం, ధరణి గురించి మాట్లాడటం తప్ప దళితుల గురించి మాట్లాడటం లేదన్నారు. ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. దళిత బహుజన శ్రామిక యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.నర్సింహా, పీఎంసీ రాష్ట్ర కన్వీనర్ శివలింగం, దళిత సేనా వ్యవస్థాపకులు జె.బి.రాజు, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ ఇ.ఆనందం, సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ శ్యామలదేవి, సీనియర్ అడ్వకేట్ భూపాల్, పులి కల్పన తదితరులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్
- అధిక విద్యుత్ బిల్లులు రావడంపై ఎమ్మెల్యేకు స్థానికుల ఫిర్యాదు


డీఎస్‌నగర్‌లో పవర్ బోర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

**ముషీరాబాద్:** వేసవి ప్రారంభమైన నేపథ్యంలో నీటి సమస్య తలెత్తకుండా యుద్ధప్రాతిపాదికన పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని డీఎస్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పవర్ బోర్‌ను ఎమ్మెల్యే ముఠా గోపాల్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల అవసరాలను తీర్చేందుకు తమవంతు బాధ్యతగా అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. ఇక నుంచి బస్తీ వాసులకు మంచినీటి సమస్యలు ఉండదని స్పష్టం చేశారు. ఈ పవర్ బోర్‌కు వస్తున్న కరెంట్ బిల్లు గురించి కూడా బస్తీ వాసుల మీద భారం పడకుండా సంబంధిత అధికారులతో మాట్లాడతామని ఆయన హామీ ఇచ్చారు.

**అధిక విద్యుత్ బిల్లులపై ఫిర్యాదు**

పేద ప్రజలు నివసించే డీఎస్ నగర్‌లో అధికంగా విద్యుత్ బిల్లులు రావడంపై స్థానిక మహిళలు ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన మాట్లాడుతూ... రెండు రోజుల్లో ఉన్నతాధికారులను పిలిపించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానికంగా ఉన్న అధ్వాన రోడ్డు వల్ల ప్రజలు ప్రమాదాలకు లోనవుతున్నారని త్వరలో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతామని పేర్కొన్నారు. నాలా పరీవాహక ప్రాంత ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. పెండింగ్‌లో ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నాయకులు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, మీడియా సెల్ ఇన్‌చార్జీ ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు గోవింద్ కృష్ణ, మహేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు 'వండర్ ఉమెన్ అవార్డ్స్' ప్రదానం


ఎర్రం పూర్ణశాంతి గుప్తా

**కాచిగూడ:** అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా హస్తిన మహిళా మండలి ఆధ్వర్యంలో ఈ నెల 10న మధ్యాహ్నం 2 గంటలకు కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని లూలు మాల్‌లో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన మహిళలను 'వండర్ ఉమెన్ అవార్డ్స్'తో సత్కరిస్తున్నట్లు మహిళా మండలి ఫౌండర్ చైర్‌పర్సన్ డాక్టర్ ఎర్రం పూర్ణశాంతి గుప్త తెలిపారు. గత 8 ఏళ్లుగా ఆయా రంగాల ప్రముఖ మహిళలను పురస్కారాలతో సత్కరిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

## 11న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి సత్కారసభ


సమాజ్ సేవక్ ఎస్.గోపాల్‌రావు

**కాచిగూడ:** సమాజ్ సేవక్ ఆధ్వర్యంలో ఈ నెల 11న సాయంత్రం 5 గంటలకు కాచిగూడ నింబోలిఅడ్డలోని ఎ.కె.భవన్‌లో ఎమ్మెల్యే డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామికి సత్కారసభ నిర్వహిస్తున్నట్లు మాజీ కార్పొరేటర్ ఎస్.గోపాల్‌రావు తెలిపారు. శనివారం నింబోలిఅడ్డలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరెకటిక (సూర్యవంశి) కులస్తులను బీసీ డీ గ్రూపు నుంచి ఏ గ్రూపులోకి మార్చాలనే విషయాన్ని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ద్వారా సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించుకుంటామని చెప్పారు.

# 'కుల సంఘాల సామాజిక సమ్మేళనం'


మాట్లాడుతున్న కార్పొరేటర్ అమృత

**నల్లకుంట:** బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో శనివారం నల్లకుంట డివిజన్ ఇందిరానగర్‌లోగల గంగా గౌరీశ్వర భజన మండలి హాల్‌లో 'కుల సంఘాల సామాజిక సమ్మేళనం' జరిగింది. దీనికి హాజరైన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్ గౌడ్, నల్లకుంట కార్పొరేటర్ వై. అమృత మాట్లాడారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న బీసీ సంక్షేమ పథకాలను వివరించారు. అర్హులైన వారు ఆ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సి. వినోద్ యాదవ్, ప్రధాన కార్యదర్శి అచ్చిని రమేష్, హైదరాబద్ సెంట్రల్ జిల్లా కార్యదర్శి ఎంబీ.కిశోర్ కుమార్, నల్లకుంట అధ్యక్షుడు యాదగిరి యాదవ్, ఎస్. వెంకట స్వామి గౌడ్, వివిధ సంఘాల నాయకులు పూస నర్సింహా గంగపుత్ర, డి. వెంకటేష్, మధు యాదవ్, ధర్మేందర్, వీరయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# షహీద్ భగత్ సింగ్ యువజన ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

**కాచిగూడ:** ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ హైదరాబాద్ నగర కమిటీల ఆధ్వర్యంలో మార్చి 1వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్న షహీద్ భగత్ సింగ్ యువజన ఉత్సవాల పోస్టర్‌ను శనివారం నారాయణగూడలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ... డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ నిర్వహిస్తున్న సే నోటు డ్రగ్స్ స్లోగన్‌తో యువజన ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి మాదక ద్రవ్యాలు నియంత్రించడంలో తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. యువత, విద్యార్థులు చెడుదారులకు వెళ్లకుండా జీవితాలను ఆగం చేసుకోకుండా సమాజానికి మంచి పౌరులుగా ఉండాలని అన్నారు. డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ నిర్వహిస్తున్న విద్యార్థులు, యువతని చైతన్య పరుస్తున్నటువంటి సెమినార్స్, వ్యాసరచన, చిత్రలేఖనం, క్రీడలు, ఉపన్యాసం, రక్తదాన శిబిరాలు నిర్వహించడం సంతోషకరమని అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు లెనిన్, కార్యదర్శి అశోక్‌రెడ్డి, డీవైఎఫ్‌ఐ అధ్యక్షుడు హాస్మి బాబు, కార్యదర్శి జావిద్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే సమాజాభివృద్ధి


పుస్తకాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ హిప్నో పద్మకమలాకర్, కృష్ణవేణి

**కవాడిగూడ:** మహిళలు అన్ని రంగాలలో రాణించినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మకమలాకర్, జి.కృష్ణవేణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని రామకృష్ణ మఠంలో యోగా నంద రఘు మహరాజు, నవ భారత్ లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో బాలల సేవా విభాగంలో మహిళల సమస్యలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలకు మహిళా ఫ్రీడమ్ ఫైటర్స్ పుస్తకాలు, పండ్లు, పోషకాహారం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళల్లో వెనకబాటుతనం ఇంకా తగ్గలేదన్నారు. ఇన్‌చార్జి హారతి, బాలబాలికలు తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

**బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు**


మాట్లాడుతున్న డాక్టర్ గౌతమ్‌రావు

**కాచిగూడ:** రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అంకితభావంతో పనిచేయాలని ఆ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు పిలుపునిచ్చారు. శనివారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన అంబర్‌పేట నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ నెల 11వ తేదీన ప్రధాని నరేంద్రమోదీకి అందరూ మద్దతు తెలుపాలని ఆయన సూచించారు. 12వ తేదీన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తెలంగాణకు వస్తున్న సందర్భంగా నిర్వహించే బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. బీజేపీ నేతలు శ్యామ్‌రాజ్, రవిప్రసాద్ గౌడ్, కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, చిట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

# అద్భుతం.. లింగోద్భవ కాలం

**భక్త జన సందోహం నడుమ శివపార్వతుల కల్యాణ సంబురం**


భవానీశంకర ఆలయంలో అర్చకులు...


పూజల్లో పాల్గొన్న భక్తులు

**చిక్కడపల్లి:** చిక్కడపల్లిలోని వివేక్‌నగర్‌లోని ప్రసిద్ధ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలోని భవాని శంకర ఆలయంలో నర్మదబాణాలింగానికి మహాశివ రాత్రి పర్వదినం సందర్భంగా రాత్రి 1.30 గంటలకు లింగోద్భవ పూజలు పండువగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో పార్వతీపారమేశ్వరుల కల్యాణం ఆలయ ఈవో ఎం.దేవనాథం పర్యవేక్షణలో రమణీయంగా నిర్వహించారు. శనివారం ఉదయం భక్తులు ఉపవాస దీక్షలతో మళ్లీ పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్, ఆలయ మాజీ ధర్మకర్త జానకి సుధాకర్, నాయకులు శీలం సత్యనారాయణ, జయందర్‌బాబు, గుర్రం శంకర్, డీసీసీ ప్రాధాన కార్యదర్శి బంటారం యాదగిరిగౌడ్, గుండు జగదీష్‌బాబు, డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ, శ్యామ్ ముదిరాజ్, బాబ్జీ, నర్సింగ్‌రావు, సుబ్బు, భాస్కర్‌రెడ్డి, శశికుమార్, ఆలయ ప్రధాన అర్చకులు బుగ్గ లక్ష్మీపతిశర్మ, అర్చకులు కె.కృష్ణమూర్తి, కందాళ వెంకటాద్రి, ఎస్.బి.వి.ఎస్.ఆచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## 31 వరకు మహిళా జర్నలిస్టులకు వైద్య శిబిరం

**ముషీరాబాద్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ముషీరాబాద్ కేర్ ఆస్పత్రిలో శనివారం నుంచి మహిళా జర్నలిస్టులకు స్వల్ప రుసుముతో ఈ నెల 31 వరకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ముషీరాబాద్ కేర్ ఆస్పత్రి మీడియా సెల్ ఇన్‌చార్జీ సతీష్ తెలిపారు. జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన మహిళలు, మహిళా జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో ర్యాండమ్ బ్లడ్ షుగర్, బీపీ, ఈఎస్ఆర్, రక్త పరీక్షలు, యూరిన్ పరీక్షలు, థైరాయిడ్, అల్ట్రా సౌండ్, బ్రెస్ట్ ఎగ్జామినేషన్, మహిళలకు తదితర వ్యాధులను ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్లు పరీక్షలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

## అన్ని పార్టీలు బీసీలకు సీట్లు కేటాయించాలి

**లిబర్టీ:** అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు సముచితమైన లోక్‌సభ సీట్లు కేటాయించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమారస్వామి కోరారు. రాజకీయంగా వెనుకబడిన బీసీ కులాలకు రాజకీయంగా మరింత పెద్దపీట వేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్ భారతీయ రాష్ట్ర సమితి బీజేపీ తదితర పార్టీలు లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సీట్లు కేటాయించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... బీసీల అభివృద్ధికి సంక్షేమానికి కృషి చేస్తుందని తెలిపారు. అదే క్రమంలో రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ కనీసం ఏడు స్థానాలు కేటాయించి బీసీల మనస్సును దోచుకోవాలని కోరారు. బీసీ జనాభా ప్రకారం బీజేపీ, బీఆర్‌ఎస్ సముచితమైన టికెట్లు కేటాయించి బీసీల రాజకీయ అభివృద్ధికి తోడ్పడాలని కుమారస్వామి విన్నవించారు.

## నేడు డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల కృతజ్ఞతాభినందన సభ

**పంజగుట్ట:** ప్రభుత్వ డిగ్రీ గెస్ట్ లెక్చరర్స్ సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో చేర్చి, పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతాభినందన సభ రాష్ట్రస్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం అధ్యక్షులు డాక్టర్ సి.హెచ్.కిషోర్ కుమార్ తెలిపారు. ఈ నెల 10వ తేదీ ఆదివారం (నేడు) ఖైరతాబాద్ లోని రంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శనివారం ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఆయన మాట్లాడుతూ... సమావేశానికి రాష్ట్రంలోని 132 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలల్లో పని చేస్తున్న 1940 మంది గెస్ట్ లెక్చరర్స్ హాజరౌతారని తెలిపారు. ముఖ్య అతిథులుగా ఐటీ శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి, గాలిరెడ్డి హర్షవర్ధన్‌లు పాల్గొంటారని తెలిపారు.

## ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

**లిబర్టీ:** రాష్ట్ర ప్రగతి కోసం ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ప్రజా పాలన అందిస్తుందని కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్ అన్నారు. ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఇప్పటికే నాలుగు గ్యారంటీలు అమలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం తమ చిత్తశుద్ధి నిరూపించుకుందని పేర్కొన్నారు. లిబర్టీ ప్లాజాలోని జన సంక్షేమ సంఘం కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబిగా మార్చిందని, ప్రభుత్వం నడపడానికి కష్టంగా ఉందన్నా అయినా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజాహితం కోసం కృషి చేస్తుందని పేర్కొన్నారు. జన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకటనారాయణ మాట్లాడుతూ... ప్రజలకు ఇచ్చిన హామీలకు ప్రభుత్వం నిర్దిష్ట గడువులో అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు.

# వైభవంగా లింగోద్భవ పూజలు


మోతీమార్కెట్ శివాలయంలో కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

**కాచిగూడ:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం అర్ధరాత్రి ఆలయాల్లో లింగోద్భవ పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. కాచిగూడ డివిజన్ మోతీమార్కెట్, నెహ్రూనగర్, లింగంపల్లి, చెప్పల్‌బజార్, విక్రమ్‌నగర్, నింబోలిఅడ్డ తదితర ప్రాంతాల్లోని శివాలయాల్లో భక్తులు లింగోద్భవ వేళ దీపాలు వెలిగించి హారతులు ఇచ్చారు. సర్వేశ్వరుడు మహా లింగాకృతునిగా ఆవిర్భవించిన సమయాన్ని లింగోద్భవంగా ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించడం ఆనవాయితీగా. ఆయా ప్రాంతాల్లో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్‌యాదవ్, దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, వై.అమృత, మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, బీఆర్‌ఎస్ నేతలు దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

# రవన్న ఆశయాలను కొనసాగిస్తాం


చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

**ముషీరాబాద్:** రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) ఆశయాలను కొనసాగించాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం.హన్మేష్, మాస్ లైన్ రాష్ట్ర కార్యాదర్శి వర్గ సభ్యులు ఎస్.ఎల్. పద్మ అన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో రాయల సుభాష్ చంద్రబోస్(వరన్న) 8వ వర్ధంతి సభ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి వి.ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై రవన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు స్వరూప, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్, నేతలు వరలక్ష్మి, లక్ష్మీబాయి, పుష్ప, అనిల్, కృష్ణ, రవి, కిరణ్, అఫ్జల్, రవి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాలలో రాణించాలి



అవార్డు గ్రహీతలతో ప్రముఖులు

**కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి**

**చిక్కడపల్లి:** మహిళలు ఐక్యంగా ఉంటూ అన్ని రంగాల్లో రాణించాలని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. శనివారం రాత్రి కళాదర్బార్ వ్యవస్థాపక అధ్యక్షుడు పొత్తూరి రంగారావు ఆధ్వర్యంలో ప్రపంచ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఝాన్సీలక్ష్మీబాయి నారీశక్తి అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ రంగాల నుంచి ఎంపిక చేసిన పలువురు ప్రముఖ మహిళలకు అవార్డులను ప్రదానం చేసి సన్మానించారు. తొలుత నిర్వహించిన సినీ సంగీత విభావరిలో త్రినాథరావు, చింతలపాటి సురేష్, అనూష పాడిన పాటలు సభికులను అలరించాయి. ప్రముఖులు దైవజ్ఞశర్మ, ప్రముఖ నాట్యగురువు స్వాతి సోమనాథ్, రఫీ, ఆర్.వెంకటేశ్వర్‌రావు, జయనాయుడు, కె.శివ, చక్రపాణి, సబిత, వర్షిక, చేబ్రోల్ శశిబాల, డాక్టర్ తస్నీరు అనురాధ, నాగజ్యోతి, అక్కినేని లక్ష్మి, సాయిసుధ, సౌమ్య వందనలకు అవార్డులు ప్రదానం సత్కరించారు.

## కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ జీఓ-16ను రద్దు చేయాలి

**ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కమిటీ డిమాండ్**


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

**పంజగుట్ట:** రాజ్యాంగ విరుద్ధమైన కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ జీవో 16ను రద్దుచేసి నేరుగా నియామకాలు చేపట్టి తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత విద్యలో నాణ్యత, ప్రమాణాలు పాటించాలని ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కాంట్రాక్ట్ లెక్చరర్‌లను క్రమబద్ధీకరిస్తే జరిగే నష్టాలపై రూపొందించిన పుస్తకాన్ని కమిటీ అధ్యక్షుడు సైదుల్ రెడ్డి, ప్రతినిధులు శంకర్, ఖలీల్, సంపత్ కుమార్, ఏడుకొండలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ నియామకాల్లో ఎలాంటి నోటిఫికేషన్లు లేకుండా, రూల్ ఆఫ్ రిజర్వేషన్, రాతపరీక్ష, మెరిట్ లిస్టు, ఇంటర్వ్యూ లాంటివి ఏమీ పాటించలేదన్నారు. ఇలా నేరుగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చెయ్యడం రాజ్యాంగ విరుద్ధమని పలు రాష్ట్రాల అత్యున్నత న్యాయస్థానాలు స్పష్టమైన తీర్పు ఇచ్చిన విషయం గుర్తుచేసుకోవాలన్నారు. ఈ క్రమబద్ధీకరణలో సుమారు వెయ్యి మంది అర్హత లేకున్నా నకిలీ సర్టిఫికెట్లు, దొంగ డాక్టరేట్ పట్టాలతో నియామకాలు పొందారని ఆరోపించారు. ఈ నియామకాలపై తాము కూడా తెలంగాణ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించామని హైకోర్టు గత సంవత్సరం మే 4వ తేదీన తుది తీర్పు వచ్చే వరకు కాంట్రాక్ట్ ఉద్యోగులకు నియామక ఉత్తర్వులు ఇవ్వరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని, అయినప్పటికీ కోర్టు ఉత్తర్వులను అపహాస్యం చేస్తూ అప్పటి ఉన్నత విద్యా అధికారులు రాత్రికి రాత్రే నియామక పత్రాలు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం ఈ ప్రభుత్వమైనా జీవో 16ను రద్దు చేసి నోటిఫికేషన్ల ద్వారా నియామకాలు జరపాలని డిమాండ్ చేశారు.

## అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి


డ్రైనేజీ పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

**అంబర్‌పేట్:** అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలని బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం డివిజన్‌లోని తిలక్‌నగర్ చౌరస్తాలో నిర్మిస్తున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. కాలం చెల్లిన పైప్‌లైన్ వ్యవస్థతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని ఇక్కడ చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తివతే ఇబ్బందులు తొలుగుతాయన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, జలమండలి మేనేజర్ మాజీద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న భక్తి సంగీత విభావరి


భక్తి గీతాలు ఆలపిస్తున్న దృశ్యం

**నల్లకుంట:** మహా శివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నల్లకుంట శంకరమఠం ప్రాంగణంలో 'భక్తి సంగీత విభావరి' ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలిండియా రేడియో, టీవీ కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణ మూర్తి శిష్య బృందం ఆలపించిన భక్తి గీతాలు ఆహూతులను ఆద్యంతం ఆకట్టుకున్నాయి. కీ బోర్డుపై యామిని, నందిని, గౌరీభట్ల వసుధా మూర్తి గాత్ర సహకారం అందించారు.

## నేత్రపర్వంగా 'గిరిజా కల్యాణం'


గిరిజా కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

**నల్లకుంట:** మహా శివ రాత్రి మహోత్సవాల సందర్భంగా శనివారం నల్లకుంట శంకరమఠంలో శక్తి గణపతి, చంద్ర మౌళీశ్వర స్వామి, శారదాంబలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుడు శ్రీనివాస శర్మ మంత్రోచ్ఛరణల నడుమ 'గిరిజా కల్యాణం' నేత్ర పర్వంగా నిర్వహించారు. ఆదిదంపతుల కల్యాణం తిలకించేందుకు పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ కావించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కల్యాణ వేడుకల్లో శంకరమఠం నల్లకుంట బ్రాంచ్ హెడ్ కె. కృష్ణారావు దంపతులు పాల్గొన్నారు.

## గాంజాశంకర్ చిత్రం పేరు మార్పును స్వాగతిస్తున్నాం

**జవహర్ బాల్‌మంచ్ హైదరాబాద్ చైర్మన్ విధూర్‌చావ్లా**


విధూర్‌చావ్లా

**కవాడిగూడ:** గాంజా శంకర్ చిత్రం పేరును తొలగిస్తున్నట్లు ఆ చిత్ర యూనిట్ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని జవహర్ బాలమంచ్ హైదరాబాద్ చైర్మన్ విధూర్‌చావ్లా అన్నారు. శనివారం ఆయన కవాడిగూడలో విలేకరులతో మాట్లాడుతూ... సాయిధరమ్ తేజ్ హీరోగా ఇటీవల గాంజాశంకర్ పేరుతో సినిమా చిత్రీకరణ చేశారని... సినిమాలకు అలాంటి పేర్లు పెట్టడం వల్ల విద్యార్థులు, యువత సినిమా చూసి చెడిపోయే అవకాశం ఉందన్నారు. తక్షణమే ఆ పేరును తొలగించాలని కోరుతూ జవహర్ బాల్‌మంచ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సెంట్రల్ సెన్సార్ బోర్డు, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేశామన్నారు. దీంతో సెంట్రల్ సెన్సార్ బోర్డు, హోంశాఖ స్పందించి ఆ చిత్ర యూనిట్‌కు నోటీసులు జారీ చేయడంతో వెంటనే ఆ చిత్రయూనిట్ ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి గాంజా శంకర్ పేరును తొలగిస్తున్నట్లు ప్రకటించడాన్ని తాము స్వాగతిస్తున్నామని తెలిపారు. తాము ఈ చిత్రంపై ఫిర్యాదు చేయడం వల్లనే సినిమా పేరును తొలగించారని పేర్కొన్నారు. చిత్రం పేరును తొలగించడానికి కృషి చేసిన హోం శాఖ, సెన్సార్ బోర్డు నార్కోటిక్ విభాగానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## గురుకుల అభ్యర్థుల కోసం న్యాయ పోరాటం

**ఉస్మానియా యూనివర్సిటీ:** గురుకుల ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల కోసం న్యాయ పోరాటం చేయనున్నట్లు ఓయూ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఎల్చాల దత్తాత్రేయ శనివారం పేర్కొన్నారు. డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ తదితర 9 వేల ఉద్యోగాలకు 1:2 మెరిట్ ప్రకారం ఎంపికైనట్లు తెలిపారు. అయితే ఇందులో కేవలం 5 వేల మందికి ఉద్యోగాల నియామక పత్రాలు అందజేశారని మిగిలిన 4 వేల ఉద్యోగాలను పక్కన పెట్టారని వివరించారు. మిగిలిన 4 వేల ఉద్యోగాలను కూడా మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయాలని గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కొందరు అభ్యర్థులకు ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలకు ఎంపికయ్యారని వారు పెద్ద ఉద్యోగంలో చేరగా మిగతావి ఖాళీగా ఉంటున్నాయన్నారు.